క్లుప్తంగా

ఇంటర్ పరీక్ష కేంద్రం సందర్శన



జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ ఆంజనేయులు మంగళవారం సందర్శించారు. నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రంలో చేసిన ఏర్పాట్లతో పాటు ఇతర వివరాలు అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

'అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయించాలి'



బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవిని బీసీ వర్గానికి కేటాయించాలని ఆ పార్టీ నాయకుడు సందెల రాము అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవిని రెండు పర్యాయాలుగా ఓసీలకు ఇచ్చారని, ప్రస్తుతం బీసీలకు ఇవ్వాలన్నారు. పార్టీలో అత్యధికంగా ఉన్న బీసీలను ఆదరించాలని జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కోరారు. నాయకులు అరుకల శ్రీనివాస్, యాదగిరి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మోడెం విజయభాస్కర్, గౌరవ అధ్యక్షుడిగా కుర్ర భాస్కర్‌గౌడ్, వైస్ చైర్మన్లుగా నారగోని పరమేష్, నంగునూరి రాజు, ప్రధాన కార్యదర్శిగా నారగోని రాములు, కార్యదర్శిగా మాచర్ల స్వామి, కోశాధికారిగా పొన్నం కుమార్ సభ్యులుగా సట్ల భాస్కర్, సురేష్, అనీల్‌కుమార్, రమేష్, నారగోని వెంకన్న, తాళ్లపల్లి రమేష్ ఎన్నికయ్యారు. నారగోని రాజు, ఉట్కూరి సునయ్, మాచర్ల శ్రీనివాస్, మాచర్ల ప్రవీన్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయం ముందు భాగంలో ఎల్లమ్మ తల్లి విగ్రహ ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గ్రామానికి చెందిన మాచర్ల సతీష్‌కుమార్–చందన దంపతులతో పాటు కుమారుడు, కూతురులు రూ.25,116, నారగోని గాయత్రి–రవిచంద్ర కుమారుడు రూ.25,116 విరాళం అందించినట్లు కమిటీ బాధ్యులు తెలిపారు.

వెలమ సంక్షేమ సంఘం కమిటీ..



హన్మంతరావు

పాలకుర్తి టౌన్: పాలకుర్తి వెలమ సంక్షేమ సంఘం కమిటీ అధ్యక్షుడిగా వీరమనేని హన్మంతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికలో గౌరవ అధ్యక్షుడిగా వీరమనేని సోమేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా వీరమనేని గోపాల్ రావు, ప్రధాన కార్యదర్శిగా వీరమనేని వెంకటేశ్వర్‌రావు, కోశాధికారిగా బచ్చు సోమేశ్వర్‌రావు ఎన్నికయ్యారు.

మోటార్లు, స్టార్టర్లు, పైపుల అపహరణ

జఫర్‌గఢ్: పంట పొలాల వద్ద బోరు బావులకు సంబంధించిన మోటార్లు, స్టార్టర్లు, పైపులను దుండగులు ఎత్తుకెళ్లిన సంఘటన మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత రైతులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతులు గుండెబోయిన రాజు, వడ్లకొండ నాగరాజు ఉదయం పంటపొలాలకు నీరుపెట్టేందుకు బోరు బావుల వద్దకు వెళ్లారు. మోటార్లు ఆన్ చేస్తే పనిచేయలేదు. బోరు బావులకు సంబంధించిన మోటార్లు, స్టార్టర్లు, పైపులతో పాటు వాటికి సంబంధించిన వైర్లు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కాపర్ వైర్ చోరీ

మండలంలోని తిమ్మంపేటలో వ్యవసాయ బోరు బావులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన కాపర్ వైర్‌ను దుండగులు చోరీకి పాల్పడినట్లు రైతులు తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత విద్యుత్ అధికారులకు తెలుపడంతో ఏఈ విశ్వసాహితి లైన్‌మన్ కుమారస్వామి మంగళవారం పరిశీలించారు. కాగా, ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

స్వయంపాలనతో విద్యార్థుల్లో నైపుణ్యం



రఘునాథపల్లి: స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



పాలకుర్తి: ఈరవెన్నులో...



కొడకండ్ల: విద్యార్థులతో ఉపాధ్యాయులు



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న జయప్రకాశ్



చిల్పూరు: పల్లగుట్ట ఉన్నత పాఠశాలలో..



స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెంలో..

రఘునాథపల్లి: స్వయంపాలనతో విద్యార్థుల్లో నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని హెచ్‌ఎం ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని నిడిగొండ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు ఘనంగా స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు ఉత్సాహంగా పాఠాలు బోధించారు. స్వయంపాలన వేడుకల్లో డీఈఓగా కె.కళ్యాణ్‌రామ్, డిప్యూటీ డీఈఓగా పి.ఉష, హెచ్‌ఎంగా జె.ఉదయశ్రీతో పాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు విద్యాబోధనలో తమ అనుభవాలను వివరించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు నిజజీవితంలో ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కవిత, ఎస్‌ఎంఎస్ చైర్మన్ మేడ స్వామి, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, శ్యాంసుందర్‌రావు, అరుణ్, సౌభాగ్యలక్ష్మి, సావిత్రి, జ్యోతిర్మయి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

కొడకండ్ల: మండలంలోని రామవరం ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యాబోధన చేశారు. డీఈఓగా సల్మాన్, హెచ్‌ఎంగా అక్షిత, ఉపాధ్యాయులుగా సోని, రిజ్వానా, సంతోష్, జయంత్, స్వామి, సూర్యలు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జక్కుల ప్రభాకర్, ఉపాధ్యాయులు శ్రీహరి, సరిత, ఆంజనేయస్వామి, వెంకన్న, ఉప్పలయ్య అభినందించారు.

ఈరవెన్నులో..

పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వయంపాలనలో హెచ్‌ఎంగా గోరంతలయ శృతి, డీఈఓగా కొడిశాల లిఖిత్ ప్రేమ్ వ్యవహరించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేసి వారిని అభినందించారు. తోట వెంకటేశ్వర్లు, కేదారేశ్వరి, మధుకర్ రెడ్డి, శాగ నర్సయ్య, విష్ణుమూర్తి, రమేష్ పాల్గొన్నారు.

తిమ్మంపేటలో..

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠశాల విధులకు హాజరయ్యారు. తొలుత తోటి విద్యార్థులచే ప్రార్థన చేయించిన అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం ఇంద్రాసేనారెడ్డి, ఉపాధ్యాయులు మంగు జయప్రకాశ్, కవిత, అయిత కృష్ణ, పీఈటీ కొండ రవి పాల్గొన్నారు.

పల్లగుట్టలో..

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వయంపాలన దినోత్సవంలో డీఈఓగా చిదురాల శ్రీరామ్, హెచ్‌ఎంగా ముక్కెర కార్తీక వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేతిడి నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు కోమలి, నరసింహారావు, సురేష్, మూల లక్ష్మి, రామూర్తి, కృతాత్మమూర్తి, రమాదేవి, వి.లక్ష్మి, రోజా, రమణకుమార్, నరేందర పాల్గొన్నారు.

ఇప్పగూడెంలో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం జెడ్పీఎస్‌ఎస్‌లో జరిగిన స్వయం పరిపాలన దినోత్సవంలో డీఈఓగా పి.వంశీ, హెచ్‌ఎంగా ఆర్.అనుష్క, చైర్మన్‌గా కల్పనతో పాటు ఇతర విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం రఘుజీ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రతిభ పెంపొందుతుందన్నారు. అనంతరం స్వయం పరిపాలన దినోత్సవంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఈటీ గీరెడ్డి ప్రమోద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాలి'



మాట్లాడుతున్న ప్రతినిధులు

జనగామ: జిల్లాలోని పాలకుర్తి మండలం కంబాలకుంటతండాలో విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఈ.దేవేందర్‌రెడ్డిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు కాటంగూరు సత్యనారాయణరెడ్డి, తిరువరంగం ప్రభాకర్, సీహెచ్ మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యాపారం చేయడం ఏంటన్నారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించి వరంగల్, హైదరాబాద్ హైకోర్టులో కేసులు నడుస్తున్నా ఉన్నతాధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులు, హాజరు శాతం ఎంత, రెగ్యులర్‌గా విధులకు హాజరవుతున్నారా లేదా అనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై డీఈఓ రామును వివరణ కోరగా తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడు దేవేందర్‌రెడ్డికి చార్జి మెమో ఇవ్వడం జరిగిందని, సంజాయిషీ ఇవ్వాల్సి ఉందన్నారు. దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ డీఈఓ, ఆర్‌జేడీకి ఫిర్యాదు చేశారని, ఎంఈఓ విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదికలను పంపించారన్నారు. తనను ఎవరూ కూడా తప్పుపట్టడం లేదని, కావాలని ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. 30 ఏళ్ల నుంచి ఇలా బాధపెడుతున్నారని, విధుల్లో అంకిత భావంతో పని చేస్తున్నానన్నారు.

దేవాదుల కాల్వ ద్వారా చెరువులు నింపాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ రూరల్: దేవాదుల కాల్వల ద్వారా మండలంలోని అన్ని గ్రామాల చెరువులు నింపాలని సీపీఎం మండల కార్యదర్శి బొడ నరేందర్, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. పోత్కనూరి ఉపేందర్, కళ్యాణం లింగం, మల్లయ్య, యాదగిరి, రాములు, అంజయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: మండలంలోని చెరువులు, కుంటలను దేవాదుల కాల్వల ద్వారా నింపి రైతుల పంటలకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంచు విజేందర్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్ ఎదుట ధర్నా చేసి వినతి పత్రాన్ని తహసీల్దార్ విశాలాక్షికి అందజేశారు. మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సమ్మయ్యకు సన్మానం



దేవరుప్పుల: చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ దక్కిన వేళ... రంగస్థలం, పుష్ప సినీ దర్శకుడు, రచయిత సుకుమార్ మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని తన స్వగృహానికి ఆహ్వానించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ అంతరించిపోతున్న గ్రామీణ చిందు యక్షగాన కళలకు జీవంపోస్తున్న సమ్మయ్యను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ పురస్కారం ఇవ్వడం హర్షణీయమన్నారు.

ఎంపీ టికెట్ 'పెరుమాండ్ల'కు ఇవ్వాలి

స్టేషన్‌ఘన్‌పూర్: భారతీయ జనతా పార్టీ నుంచి వరంగల్ ఎంపీ టికెట్ తెలంగాణ మాల పోరాట సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లుకు ఇవ్వాలని టీఎంపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకేశ్వరపు రమేష్ అన్నారు. టీఎంపీఎస్ ముఖ్య కార్యకర్తల జిల్లా స్థాయి సమావేశాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు దండ్రె అనీల్‌కుమార్ అధ్యక్షతన ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెరుమాండ్ల వెంకటేశ్వర్లు బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి క్రమశిక్షణతో పనిచేస్తున్నారని, ఎన్ని కష్ట నష్టాలు వచ్చినా ఓర్చుకుని నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేస్తున్నారన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లుకు ఎంపీ టికెట్ ఇవ్వాలని ఆయన కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములపైడి, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, రమేష్, జిల్లా నాయకులు పవన్, అనీల్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

పాలకుర్తి: ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని సీఐ జి.మహేందర్ రెడ్డి, ఎస్సై ఎం.సాయిప్రసన్న కుమార్ సూచించారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో సీఐ ఆధ్వర్యాన రోడ్డుపై ఉన్న చిరు వ్యాపారుల బండ్లను, వాహనాలను తొలగించారు. షాపుల ముందు వాహనాల పార్కింగ్ చేయొద్దని, ప్రతి ఒక్కరూ శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలన్నారు.

పండ్లు పంపిణీ

బచ్చన్నపేట: మండలంలోని రామచంద్రాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పూర్వ విద్యార్థులు పండ్లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్యామోహన్ రాజ్ , పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన బీఎస్‌ఆర్‌కేఎస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నూతన సీఐ ముస్క రాజును భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు ఆధ్వర్యంలో సంఘం నాయకులు మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల అనీల్‌కుమార్, మండల అధ్యక్షుడు చింత వెంకటయ్య, నాయకులు చింత శ్రీనివాస్, తాటికొండ లింగయ్య, గోనెల రాజు, వీరన్న, రాజు, రవి పాల్గొన్నారు.

పరామర్శ

దేవరుప్పుల: మండలంలోని రామరాజుపల్లిలో ఉప్పునూతుల యేశమ్మ మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు పురుషోత్తం కృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పునూతుల సురేష్, మాజీ సర్పంచ్ బోయిని లింగయ్య, ఉప్పునూతుల సురేష్ తదితరులు ఉన్నారు.

సమాజ హితానికి యువత పాటుపడాలి

దేవరుప్పుల: సమాజ హితం కోసం యువత పాటుపడాలని ఎస్సై ఎన్.చెన్నకేశవులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు ఇనుముల నాగరాజు ఆధ్వర్యంలో ఎస్సైకి జ్ఞాపికను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇనుముల నాగరాజు, మండల సీనియర్ నాయకులు నరేందర్, రాజేందర్, రెడ్డి రాజుల రమేష్ , భాస్కర్, చందర్ ఉన్నారు.

హామీల అమలుపై హర్షం



కొడకండ్ల: సీఎం, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కొడకండ్ల: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను విస్మరించడం బీఆర్‌ఎస్ నైజమైతే ఇచ్చిన హామీలను నేరవేర్చడం కాంగ్రెస్ నైజమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. గృహలక్ష్మి, గ్యాస్ సిలిండర్ హామీలను మంగళవారం ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిల ఫ్లెక్సీలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌నాయక్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు అమలు చేసిన ప్రభుత్వం నేడు మరో రెండింటిని అమలు చేస్తుందని, నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన కొనసాగిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోమనర్సయ్య, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, నాయకులు భిక్షపతి, రమేష్, శ్రీను, ఉప్పల చిన్నసోమయ్య, ఖలీం, అంజయ్య, రవీందర్, మనోహర్, దేవేందర్, శ్రీకాంత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చదవడం, రాయడంలో నైపుణ్యం పెంచుకోవాలి

రఘునాథపల్లి: విద్యార్థులు చదవడం, రాయడంలో నైపుణ్యం పెంచుకోవాలని మండలంలోని ఖిలాషాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఏ.శ్రీనివాస్‌లు విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆయన కాంప్లెక్స్ పరిధిలోని జాఫర్‌గూడెం, మంగళిబండతండా, సోమరాజుపల్లి, మేకలగట్టు, ఎర్రగడ్డతండా, మండలగూడెం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల రికార్డులు, మధ్యాహ్న భోజన అమలును పరిశీలించారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలపై ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ శ్రీనివాస్, పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.


నిత్యావసరాల పంపిణీ

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట అభయ ఫౌండేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు పాలెపాక అంబుప్రసన్న ఆధ్వర్యంలో దళిత మహిళలకు నిత్యావసర సరుకులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అభయ ఫౌండేషన్ ఆధ్వర్యాన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. బైరపాక సురేష్, భిక్షపతి, మొండయ్య, కొంరయ్య, యాదయ్య, నర్సయ్య, శ్యామల పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కొడకండ్ల: మార్చి 1వ తేదీన పాలకుర్తి నియోజకవర్గంలో బీజేపీ ఆధ్వర్యాన నిర్వహించే విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని పార్టీ మహబూబాద్ జిల్లా కార్యదర్శి కొలుపుల శంకర్ కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత దేశ గొప్పతనాన్ని, కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసిన మహానేత ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో ముచ్చటగా మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవడం ఖాయమన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి మోడపల్లి సోమన్న, నాయకులు కన్నయ్య, రమేష్, మహేష్, అంజనేయులు, మహేష్, ప్రకాష్, ఉపేందర్, అజయ్, రామకృష్ణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



రఘునాథపల్లి: రఘునాథపల్లి ఎంపీడీఓగా గార్లపాటి శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ ఎండీ హసీం సూర్యాపేట జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో జనగామ నుంచి శ్రీనివాసులు వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓను ఎంపీఓ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడు కనకం విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్, ప్రధాన కార్యదర్శి ముసిపట్ల భాస్కర్, సాయిబాబ, నర్సింహా, కవిత, శ్రీలత, మౌనిక, శివాజీ, రాజీవ్, రమేష్, శివ ఉన్నారు.

'కార్యకర్తలపై దాడి హేయం'

స్టేషన్‌ఘన్‌పూర్: భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్రపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం హేయమైన చర్య అని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి పూంద్రు నవీన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రజా సమస్యల్ని తెలుసుకునేందుకు చేపట్టిన ప్రజాహిత యాత్రకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక యాత్ర శిబిరాలపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజాహిత యాత్రపై దాడి చేయడం తగదు

దేవరుప్పుల: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిపై బండి సంజయ్ చేపట్టే ప్రజాహిత యాత్రలో ప్రజాదరణ చూసి ఓర్వలేక శిబిరాలపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం తగదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ప్రజల చేతిలో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఆమె మాట్లాడారు. 5, 6వ తరగతి చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.125లు, ఇతరులు రూ.200ల ఫీజు చెల్లించి దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలన్నారు. మార్చి 2వ తేదీ దరఖాస్తులకు చివరి గడువు అని, ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. బాలికలకు హాస్టల్ వసతి ఉందని, ఆసక్తి గల విద్యార్థులు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



జఫర్‌గఢ్: మండల కేంద్రం నుంచి తిమ్మంపేట మీదుగా స్టేషన్ ఘన్‌పూర్ వరకు, అలాగే కోనాయిచలం, కూనూర్, ఉప్పుగల్లు గ్రామాల మీదుగా స్టేషన్‌ఘన్‌పూర్ వరకు కళాశాల విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆంజనేయులుకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. పార్టీ నాయకులు బుర్ర తిరుపతిగౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



నర్మెట: పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, నోడల్ అధికారి

నర్మెట: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదివి లక్ష్యసాధనతో ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల నోడల్ ఆఫీసర్ ఇర్రి వెంకట్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అందించిన పదో తరగతి పరీక్ష సామగ్రిని మంగళవారం జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ టి.శరత్ కుమార్‌లతో కలిసి మోడల్ స్కూల్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేముల సదానం, ఎమ్మార్సీ దయాకర్ పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

బచ్చన్నపేట: మండలంలోని అన్ని పాఠశాల్లోని పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి అన్నారు. మండలంలోని పలు గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే పల్లా పంపిన పరీక్ష కిట్లను ఆమె పంపిణీ చేశారు. మండల నోడల్ అధికారి మూర్తి, రమణారెడ్డి, చెంద్రారెడ్డి, కృష్ణంరాజు, సిద్ధిరాములు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

తరిగొప్పుల: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేసి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే పల్లా అందించిన పరీక్ష కిట్లను మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఎంపీపీ జొన్నగాని హరిత సుదర్శన్, జెడ్పీటీసీ పద్మజా వెంకట్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జనగామ రూరల్: చౌడారం, మోడల్ స్కూల్, మరిగడి, ఎర్రగొల్లపహాడ్, గానుగుపహాడ్, వెంకిర్యాల, వడ్లకొండ గ్రామాల్లో ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎమ్మెల్యే పల్లా సహకారంతో పరీక్ష సామగ్రిని అందజేశారు. నాయకులు ఉన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో..

పాలకుర్తి: మహాత్మా గాంధీ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు, ఎంపీఐ గంట రవీందర్ ఆధ్వర్యంలో ఇంటర్, ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేసారు. నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య, కేజీబీవీ హెచ్‌ఎం.నవీన, స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ శోభ, అనిల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి



సోమయ్య(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ గ్రామానికి చెందిన రైతు గుంటకుల సోమయ్య(40) పాముకాటుకు గురై వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. మృతుడి బావ చిక్కుడు నాగరాజు స్థానిక పోలీసులకు అందించిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమయ్య వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయ పనుల నిమిత్తం ఈనెల 25న సాయంత్రం గ్రామంలోని తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న అతని మేకలను కొద్ది దూరం తోలుకెళ్లి మేపుతున్నాడు. ఈ క్రమంలో నూనె కట్లపాము అతడి కుడికాలి చిటికెన వేలుకు కాటు వేసింది. వెంటనే బాధతో అతడు అరవగా చుట్టుపక్కల రైతులు పాము కరిచినట్లు గుర్తించి పామును చంపి బాధితుడిని చికిత్స నిమిత్తం ఘన్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కాగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.